క్లుప్తంగా

సచివాలయానికి టీడీపీ ఫ్లెక్సీలు



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌కు కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీలు అంటించారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీతోపాటు సూపర్ సిక్స్ స్టిక్కర్‌ను అంటించారు. ఈ విషయంపై సర్పంచి నక్కా కమల మాట్లాడుతూ అక్రమంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయటంపై ఆవేదన వ్యక్తంచేశారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు



నందిగామ: మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టమి తిథి రోజున కాలభైరవుడిని పూజిస్తే కష్టాలు తొలుగుతాయని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో శనివారం నందిగామ పట్టణంలోని రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో గల కాలభైరవ ఉపాలయంలో స్వామివారికి పలురకాల సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని సోమవరం, మాగల్లు, అడవిరావులపాడు, అంబారుపేట గ్రామాల్లోని శివాలయాల్లో కూడా కాలభైరవుడికి విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులను ఆదుకోవాలి

నందిగామ: ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలని బళ్లారి రాఘవ కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బెళ్ల పాటి గోపాలకృష్ణసాయి కోరారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారధిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. వృద్ధ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించి, ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అంతరించిపోతున్న కళలను కాపాడుతున్న కళాకారులను ప్రోత్సహించాలని మంత్రిని కోరినట్లు ఆయన వివరించారు.

ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న స్మైలీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ సేవలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం ప్రారంభించారు. నిరుపేద ప్రజలకు ఎంతగానో ఉపకరించే ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ సందీప్, డాక్టర్ అవినాష్, డాక్టర్ వెంకట్, హాస్పిటల్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. వైష్ణవి నాట్యశాల ట్రస్ట్‌కు చెందిన పలువురు చిన్నారులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను కట్టి పడేసింది. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.

6 నుంచి వారాహిదేవి అలంకారంలో కాళీమాత

కృష్ణలంక(విజయవాడతూర్పు):బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో ఆషాఢ మాసం సందర్భంగా జూలై 6 నుంచి 15వ తేదీ వరకు వారాహి నవరాత్రులను పురస్కరించుకుని కాళీమాత అమ్మవారు వారాహి దేవి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల పాటు వారాహి హోమం జరుగుతుందని పేర్కొన్నారు. హోమంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1000 పూజా రుసుం చెల్లించాలని కోరారు. భక్తులు వారాహి దేవి రూపంలో ఉన్న కాళీమాత అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని జగదీష్‌కుమార్ కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు



మున్సిపల్ ఆఫీసు వద్ద ఫాగింగ్, స్ప్రేయింగ్ పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: వర్షాకాలం ప్రారంభం కావడంతోపాటు ప్రస్తుతం నియోజకవర్గంలో డయేరియా సోకిన నేపథ్యంలో జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. పట్టణ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టేందుకు తెప్పించిన స్ప్రేయింగ్, ఫాగింగ్ యంత్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగ కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫాగింగ్, స్ప్రేయింగ్‌కు అవసరమైన మలాథియాన్ తగినంత అందుబాటులో ఉందన్నారు. ప్రజారోగ్య వర్కర్లకు అవసరమైన చీపుర్లు, పారలు, దంతెలు, కొడవళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వార్డుల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ అంతరాయం లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. 100 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు రోజూ పట్టణంలోని వీధులు,కాలువలు శుభ్రం చేయడంతో పాటు చెత్త సేకరణ చేస్తున్నారన్నారు. రెండు కంపాక్టర్లు, మూడు ట్రాక్టర్లు, ఆరు ఈ–ఆటోల ద్వారా రోజూ పట్టణంలో 28టన్నుల చెత్తను సేకరించి యార్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఆయా పారిశుద్ధ్య పనులను ఆరుగురు మేస్త్రీలు, 14మంది సచివాలయాల సెక్రటరీలు పర్యవేక్షిస్తున్నారన్నారు. పురపాలక సంఘానికి ప్రతిరోజు అందే ఫిర్యాదులను పరిష్కరించడంతో పాటు వర్షాకాలం, కోవిడ్ లాంటి ప్రత్యేక సమయాలలో కూడా శానిటేషన్ పనులు కుంటుపడకుండా సమర్థవంతంగా పనిచేసినట్లు తెలిపారు. అధికారిక కార్యక్రమాల సమయాల్లో ఆయా ప్రాంతాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు తదితర పబ్లిక్ ప్రదేశాల్లో సున్నం, బ్లీచింగ్ ఉపయోగించడం, శానిటేషన్ నిర్వహించడం ద్వారా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న వత్సవాయి వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని

మక్కపేట(వత్సవాయి) : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రభుత్వ వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని సూచించారు. డయేరియా కేసుల నేపథ్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నడుస్తున్న వైద్యశిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కొత్తగా డయేరియా కేసులు నమోదు కావడం లేదన్నారు. పరిస్థితి కుదుటపడే వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. వాంతులు, వీరేచనాల వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశిబిరంలో సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కాచి చల్చార్చిన నీటిని తాగడంతోపాటు మంసాహారం మానేయాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల మందును స్ప్రే చేయించారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ జవహర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా 70కేసులు పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీరాజ్యం

నందిగామ: లోక్‌అదాలత్‌ల ద్వారా కక్షిదారులు కేసులను సత్వరం పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు ఇన్‌చార్జి జడ్జి డి.శేషయ్య సూచించారు. స్థానిక కోర్టుల ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన జడ్జి శేషయ్య మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరన్యాయం చేకూరుతుందన్నారు. కక్షిదారులకు సమయం, సొమ్ము ఆదా అవుతాయన్నారు. ఇరువర్గాలు రాజీపడితే లోక్‌అదాలత్ ద్వారా ఒక్కరోజులోనే కేసుకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి న్యాయమూర్తులు శేషయ్య, వి.లక్ష్మీరాజ్యం,ఎస్.కె రియాజ్ లోక్‌అదాలత్ నిర్వహించి మొత్తం 70 కేసులు పరిష్కరించారు. ఆయా కేసుల ద్వారా బాధితులకు రూ 75,36,700 నష్టపరిహారాన్ని అందజేశారు. న్యాయవిజ్ఞాన సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాగర్, న్యాయవాదులు ఎక్కిరాల హనుమంతరావు, రామకృష్ణ, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం నిర్వహించాలని వినతి



విజయవాడ ఏసీ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి బ్రహ్మంగారి మఠం, భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములకు దేవాదాయ శాఖాధికారులు కౌలు వేలం పాటలు నిర్వహించాలని పలువురు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు అనుమంచిపల్లికి చెందిన రైతులు బొబ్బిలి, వెంకటేశ్వర్లు, నరసింహారావు, రవి తదితరులు శనివారం విజయవాడలోని దేవాదాయశాఖ ఏసీ కార్యాలయ సూపరింటెండెంట్‌కి ఈ మేరకు ఓ వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని బ్రహ్మంగారి మఠానికి చెందిన 4.44ఎకరాలు, మల్లేశ్వరస్వామి ఆలయానికి చెందిన 18ఎకరాల భూమికి కౌలు వేలం పాట గడువు ముగిసినా తిరిగి పాటలు నిర్వహించడం లేదన్నారు. కౌలువేలం పాటలు నిర్వహించాలని ఆలయ ఈవోను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ భూములను కౌలువేలం ద్వారా రైతులు సాగుచేసుకుంటున్నారని వివరించారు. ఇకనైనా దేవాదయశాఖ అధికారులు స్పందించి ఈ భూములకు కౌలువేలం నిర్వహించాలని వారు కోరారు.

భూములపై టీడీపీ నాయకుల కన్ను...

కొన్నేళ్లుగా ఈభూములును పలువురు రైతులు కౌలు వేలం ద్వారా హక్కులు పొంది సాగు చేసుకుంటుండగా, ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈ భూములపై టీడీపీ నాయకుల కన్నుపడిందని సమాచారం. టీడీపీ నాయకులు ఈ భూములను వారి అనుచరులకు ఇవ్వాలంటూ సంబంధిత అధికారులను బెదిరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వేలంపాటలు లేకుండా ఈభూములను కౌలుకు దక్కించుకునేందుకు సదరు టీడీపీ నాయకులు యత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆలయ భూములకు కౌలు వేలం పాటలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

అరుదైన రొమ్ము క్యాన్సర్‌కు విజయవంతంగా చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): తీవ్రస్థాయి రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న గుంటూరుకు చెందిన 42 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స అందించినట్లు అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా తెలిపారు. ఆరు నెలలుగా కుడి రొమ్ములో క్యాన్సర్ కణితిలో ఇబ్బంది పడుతున్న మహిళ కుడి ఆక్సిల్లాలో తాకుతూ ఉండే శోషరస కణుపులను కలిగి ఉన్నట్లు తెలిపారు. తీవ్రస్థాయి స్టేజ్ 3 ట్రిపుల్ నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ కారణంగా, తొలుత రోగి కణితిని తగ్గించడానికి, శస్త్ర చికిత్స అనంతరం పరిస్థితిని అంచనా వేయగానికి నియో అడ్జువాంత్ కీమోథెరపీ చేసినట్లు తెలిపారు. అనంతరం అల్ట్రాసౌండ్‌లో ఎలాంటి కణితి లేదని వెల్లడైనట్లు డాక్టర్ సృజన తెలిపారు. కాగా ఇటీవల రోగి కుడిరొమ్ముకు మాడిఫైడ్ రాడికల్ మాస్టెక్టమీని చేయించుకున్నారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం నివేదికలో ఎలాంటి అవశేష కణితి లేదని సూచించినట్లు తెలిపారు. ఇది రోగి కోలుకోవడానికి బలమైన సూచికగా పేర్కొన్నారు. ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా చికిత్స చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి 30 పోలీస్‌యాక్ట్ అమలు

విజయవాడస్పోర్ట్స్: భద్రతా చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలను జూలై ఒకటో తేదీ సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు ఈ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నా కార్యక్రమాలను ముందస్తు పోలీసు అనుమతి లేకుండా నిర్వహించడం నేరమన్నారు. నిషేధాజ్ఞలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు : కమిషనర్



మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 4,986 మంది పింఛన్‌దారులకు జూలై ఒకటోతేదీన లబ్ధిదారుల ఇళ్లవద్దనే పింఛన్ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వృద్ధులు, వితంతవులకు నెలకు ఇప్పటివరకు రూ.3వేలు ఇస్తుండగా, జూలై నుంచి రూ.4వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ నెలకు రూ.1000 చొప్పున కలిపి మొత్తం రూ.7వేలు పంపిణీ చేస్తామని వివరించారు. 50 మంది పింఛన్‌దారులకు ఒక సచివాలయ సెక్రటరీ చొప్పున మొత్తం 102మంది సచివాలయాల సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బందిని పింఛన్ల పంపిణీకి కేటాయించినట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీని పర్యవేక్షించేందుకు ఏడుగురు నోడల్ ఆఫీసర్లను కూడా నియమించినట్లు వివరించారు. పింఛన్ నగదును ఇప్పటికే డ్రా చేశామని తెలిపారు. సచివాలయ సెక్రటరీలు సోమవారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులు అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులెవ్వరూ బ్యాంకుల వద్దకు గానీ, సచివాలయాల వద్దకు గానీ వెళ్లవద్దని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

బహుముఖ ప్రతిభాశాలి బాల రాజశేఖరుని

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి దర్శకుడు బాల రాజశేఖరుని అని పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. హనీమూన్ ఎక్స్‌ప్రెస్ మూవీ విజయవంతంగా ప్రదర్శిస్తున్న సందర్భంగా సూర్యారావు పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీలో దర్శకుడి అభినంద సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణరావు మాట్లాడుతూ లలిత కళలకు, చలన చిత్రాలకు సామాజిక ప్రయోజనం ఉండాలని దర్శకుడు మరోసారి రుజువు చేశారన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ దర్శకుడు బాలు నగరానికి చెందిన వారేనని పేర్కొన్నారు. విదేశాల్లో స్క్రీన్ ప్లేలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. అమెరికాలో ఫిలిమ్ యూనిట్ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు కళింగ, నాటక రచయిత, దర్శకుడు ఎమ్ఎస్ చౌదరి, ప్రముఖ మానసిక వ్యాధుల వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, సాహితీ ప్రముఖుడు డాక్టర్ చలపాక రాంచంద్ బాలు రాజశేఖరుని చిత్ర కళాసేవలను అభినందించారు.

నేడు మహిళా విభాగం కమిటీ ప్రమాణస్వీకారం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ నూతన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు చెప్పారు. స్థానిక ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా విభాగం నూతన కమిటీ అధ్యక్షురాలిగా కొప్పురావూరి రజిని నియమితులయ్యారన్నారు. నగరంలోని ది వెన్యూ ఫంక్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ తోపాటు ఎంపీ కేశినేని చిన్ని, శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య, సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, మాజీ మంత్రి సిద్దా రాఘవరావు పాల్గొంటారని తెలిపారు. మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులైన కొప్పురావూరి రజిని మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమమే ఈ మహాసభ ముఖ్య లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ముఖ్యప్రతినిధి దర్భి వాసు మాట్లాడుతూ మహిళా విభాగం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆర్యవైశ్యులందరూ పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. విజయవాడ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ, సభ్యులు తుమ్మలపెంట శ్రీనివాస్, జీ.రామ్మోహనరావు, మహిళా విభాగం విజయవాడ అధ్యక్షురాలు మారం రోజారాణి, ప్రధాన కార్యదర్శి ఆరవేటి నిర్మల, కోశాధికారి శైలజ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విలువలతో నాయకత్వ లక్షణాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు బాల్యం నుంచి ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి నాయకత్వ లక్షణాలను వృద్ధి చేసుకోవాలని ఏపీ ఫైనాన్స్ కో–ఆపరేటివ్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ డాక్టర్ సి. కిషోర్ కుమార్ అన్నారు. ఎస్ఎస్ఎం స్కూల్ విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, దీక్ష లాంటి ఉన్నత గుణాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. సద్గుణాలు అలవర్చుకోవటానికి పాఠశాలలే ప్రధాన వేదికలని చెప్పారు. అంకితభావం, సహకారం లాంటి గుణాలను మనసులో నింపుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థి నాయకులుగా పదో తరగతి చదువుతున్న ఇషాన్ ఇనాని, డి. మౌనిక ఎన్నిక కాగా వివిధ హౌస్‌లు, క్లబ్‌లకు తరగతి నాయకులకు ఆయన బ్యాడ్జి ఇచ్చి బాధ్యతలను అప్పగించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, కరస్పాండెంట్ మౌంట్‌ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గది ప్రారంభం



డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ తదితరులు

వత్సవాయి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతిగదిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథజనార్దన్, మాజీమంత్రి నెట్టెం రఘురాం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ గతంలో ఉన్న డిజిటల్ తరగతి గది అనివార్య కారణాలతో నిలిచిపోగా జయప్రద ఫౌండేషన్ ద్వారా కొత్త డిజిటల్ గది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కూడా డిజిటల్ విధానంలో విద్యార్థులకు పాఠాలు బోధించాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మాణం చేసిన మరుగుదొడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కట్టా వెంకటనరసింహారావు, తొండపు జగన్‌మోహన్‌రావు, జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ కెనడీ, ఏవో



జగ్గయ్యపేటలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ కెనడీ

పెనుగంచిప్రోలు: విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఇంటర్నల్ స్క్వాడ్ తిరువూరు ఏడీఏ డా.,జి కెనడీ ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి కె.రామసుబ్బారెడ్డితో కలిసి పెనుగంచిప్రోలు మండలంలోని విత్తనాల దుకాణాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్స్, ఇన్వాయిస్‌లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణాల యజమానులకు సూచించారు. నాసిరకమైన విత్తనాలు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయించే వారి లైసెన్స్ రద్దు చేస్తామని ఏడీఏ హెచ్చరించారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట:విత్తనాలను అధిక ధరలకు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు వ్యవసాయ శాఖ ఏడీఏ కెనడీ హెచ్చరించారు. పట్టణంలోని సత్యపావని ట్రేడర్స్ విత్తన దుకాణాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. లైసెన్స్, బిల్లు బుక్కు, స్టాకు రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయాలు జరిపితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు వచ్చే అవకాశముందని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సూచించారు. తనిఖీల్లో ఏవో వరలక్ష్మి పాల్గొన్నారు.

చిరుద్యోగుల తొలగింపు తగదు : సీపీఎం



ఏపీఎంకు అర్జీ అందజేస్తున్న చాట్ల, చాంద్‌బేగం

వీరులపాడు:రాజకీయ కారణాలతో చిరుద్యోగులను తొలగించడం మంచి పద్ధతి కాదని సీపీఎం మండల కార్యదర్శి చాట్ల రవి మండిపడ్డారు. వీరులపాడు మండలంలో వీవోఏలుగా పనిచేస్తున్న వారిని ఏ కారణంతో తొలగిస్తున్నారో తెలపాలంటూ షేక్ చాంద్‌బేగం అనే మహిళ సమాచార హక్కు చట్టం ద్వారా ఏపీఎంకు యెహోషువాను శనివారం కోరారు. అనంతరం చాట్ల రవి మాట్లాడుతూ మండలంలోని జుజ్జూరు గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ 13 ఏళ్లుగా గ్రామ సమైక్య వీవోఏగా పని చేస్తుండగా, ఆమెను ఏ కారణంతో తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగులను రాజకీయ కారణాలతో తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిరుద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆయన కోరారు.

యువత నాణ్యమైన డేటాను అందించాలి

ఏపీ సీఆర్‌డీఏ సాంఖ్యక శాస్త్ర నిపుణులు డాక్టర్ శ్రీనివాస్



నలంద డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ విభాగం డైరెక్టర్ పీవీవీ సత్యనారాయణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): బహుళ జాతీయ కంపెనీలకు నేటి యువత నాణ్యమైన డేటాను అందించడమే లక్ష్యంగా అంచనాలు రూపొందించుకోవాలని ఏపీ సీఆర్‌డీఏ సాంఖ్యాక శాస్త్ర నిపుణులు డాక్టర్ నడిపల్లి శ్రీనివాస్ అన్నారు. పద్మవిభూషణ్ ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతి సందర్భంగా ఆంధ్రా లయోలా కళాశాలలో శనివారం జాతీయ సాంఖ్యాకశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నడిపల్లి శ్రీనివాస్ నేటి యువత సాంఖ్యాక శాస్త్రంపై పట్టు పెంచుకోవడం ద్వారా జాతీయ వాణిజ్యం వృద్ధి చెందుతుందన్నారు. నాణ్యమైన డేటాను అంచనా వేసే నైపుణ్యాన్ని విద్యార్థులు అంతకంతకూ పెంపొందించుకోవడం ద్వారా వారిలో మేథోశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ జి.కిరణ్‌కుమార్, నున్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నలంద డిగ్రీ కళాశాలలో...

విద్యార్థులు స్టాటస్టిక్స్‌లో పట్టు సాధించడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చునని రాష్ట్ర ప్లానింగ్ విభాగం డైరెక్టర్ డి.వి.వి. సత్యనారాయణ అన్నారు. ఎంజీ రోడ్డులోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం స్టాటిస్టిక్స్ దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ స్టాటిస్టిక్స్‌కి వివిధ రంగాల్లో ఉన్న ప్రాముఖ్యతను తెలియచేశారు. శాంపిల్ సర్వే, డేటా ఎనాలసిస్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనురాధ, స్టాటిస్టిక్స్ అధ్యాపకులు పి రవికుమార్, ఎ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.